క్లుప్తంగా

వినయ్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



ఆర్మూర్: ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వినయ్ కుమార్ నానమ్మ గంగవ్వ ఇటీవల మరణించడంతో ఆర్మూర్‌లోని ఆయన నివాసానికి వచ్చి పరామర్శించి సానుభూతి తెలిపారు. గంగవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు రాజన్న సంతాపసభ

ఆర్మూర్: డెమోక్రటిక్ టీచర్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఇటీవల మరణించిన రొడ్డ రాజన్న సంతాప సభను పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో ఆదివారం నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య శనివారం తెలిపారు. సభకు డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఆలయానికి హుండీ అందజేత



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట మందిరానికి హుండీని ఓ దాత కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రోద్బలంతో శనివారం అందజేశారు. ఆర్మూర్‌కు చెందిన ప్రవీణ్ సుమారు రూ.90 వేలు విలువ గల హుండీని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి శనివారం ప్రారంభించారు. గ్రామానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్నారెడ్డి, ఆకుల పెద్ద రాజన్న, గంగాధర్, ఆకుల రమేశ్, నవీన్, ఎర్రన్న, ప్రశాంత్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో యజ్ఞం



వేల్పూర్: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తి శ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నుంచి మంగళవారం వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు ప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కూనేపల్లిలో భగవద్గీత వితరణ



రెంజల్: మండలంలోని కూనేపల్లిలో శివరాత్రి సందర్భంగా భక్తులకు తెలుగులో ముద్రించిన భగవద్గీత, హనుమాన్ చాలీసా పుస్తకాలను ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం వితరణ చేశారు. ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన వీటిని భక్తులకు ఉచితంగా అందించారు. ప్రతీ ఇంట్లో ఉండాలన్న సంకల్పంతో పుస్తకాలను ముద్రించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, బుజ్జి సేట్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శనివారం భూమిపూజ చేసి, ప్రారంభించారు. నాయకులు రామర్తి గంగారెడ్డి, గుడి సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్ యాదవ్, సరికెల శ్రావణ్, రమేష్, చిన్నయ్య, అమన్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం వసూలయ్యేనా?

- మిగిలింది 21 రోజులే..
- ఆస్తి పన్ను వసూళ్లలో అధికారుల అలసత్వం
- పెండింగ్‌లో రూ. 3.32కోట్ల ఇంటి పన్ను



బోధన్‌టౌన్: పన్ను వసూళ్లలో మున్సిపల్ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుంది. ఇందుకు 21 రోజులే గడువు ఉంది. ఈ లోగా రూ. 3 కోట్ల32లక్షల99వేలు వసూలు చేయాల్సి ఉంది. ఈ కొన్ని రోజుల్లోనే అంత పన్ను వసూలు సాధ్యమేనా అంటే కాదనే చెప్పాలి. మొండి బకాయిలు సైతం పేరుకుపోయాయి. పన్నుల వసూళ్లలో మున్సిపల్ అధికారులు, పాలకుల్లో నెలకొన్న నిర్లక్ష్యానికి పేరుకుపోయిన బకాయిలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మున్సిపల్‌కు ఇచ్చిన లక్ష్యం మేరకు పన్ను వసూలు జరగడం లేదు. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో బోధన్ మున్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

బోధన్ మున్సిపల్ పరిధిలో 38 వార్డులు ఉన్నాయి. ఇందులో 17,500 ఇండ్లు, 1000 కిపైగా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా ఉంది. పట్టణ విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతుండడంతో నూతన నిర్మాణాలు పెరుగుతున్నాయి. దీంతో మున్సిపల్‌కు ప్రతి ఏటా రావాల్సిన ఆస్తి పన్ను పెరుగుతూ వస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం బల్దియా ఆస్తి పన్ను రూ. 6కోట్ల84లక్షల51 వేలు డిమాండ్ ఉంది.

ఇందులో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. కోటి11లక్షలు ఉండగా, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన ఆస్తి పన్ను బకాయిలు రూ. ఒక కోటి ఉంది. వీటితో పాటు నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఈ ఆస్తి పన్ను వసూలును గతేడాది అక్టోబర్ నుంచే వసూలు చేస్తున్నారు.

ఐదు బృందాలు ఏర్పాటు

ఆస్తి పన్ను వసూలు కోసం అధికారులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. 5 బృందాలుగా బిల్ కలెక్టర్లతో టీంకు ముగ్గురు బల్దియా సిబ్బందిని ఏర్పాటు చేసి ఏరియాను బట్టి రోజుకు టార్గెట్‌ను నిర్ధారించి వసూళ్లకు పంపుతున్నారు. ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసి ఆస్తి పన్ను చెల్లించాలని ప్రకటనలు చేస్తున్నా వసూలు కావడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే పన్నులు వసూలు కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

90 శాతం వడ్డీ రాయితీ ఇచ్చినా..

మున్సిపల్ ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు అయ్యేందుకు పురపాలక శాఖ ఉన్నతాధికారులు 90 శాతం వడ్డీ రాయితీ ఇచ్చి కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే చెల్లించే అవకాశం కల్పించారు. అయినా ఇప్పటి వరకు ఆస్తి పన్ను వసూలు 55.02 శాతం మాత్రమే అయ్యింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్ధారించిన ఆస్తి పన్ను వంద శాతం వసూలు కావడం లేదు. దీనికి ఇంకా 21 రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ గడువులోగా అధికారులు మిగిలిన పన్ను వసూలు పూర్తి చేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

ప్రత్యేక దృష్టి సారించాం



ఆస్తి పన్ను వసూలుపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించి ముందుకెళ్తున్నాం. ఐదు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి టార్గెట్ ఇచ్చాం. పూర్తి స్థాయిలో పన్ను వసూలుకు కృషి చేస్తున్నాం. ప్రజలు, వ్యాపారస్తులు సకాలంలో పన్ను చెల్లించి సహకరించాలి.

– వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్

ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



దీపదాస్ మున్షీతో మాదిగ ఉపకులాల నాయకులు

ఆర్మూర్: చేవెళ్ల డిక్లరేషన్‌లో పొందుపరిచిన విధంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షీని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న కలిసి కోరారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆమెను శనివారం కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. ఇందిరమ్మ కలలు కన్న రాజ్యం రావాలంటే అంబేడ్కర్ అందించిన ఫలాలు దళితుల్లోని 59 కులాలకు సమానంగా పంపిణీ చేసినప్పుడే సాధ్యమన్నారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, బోనాల మల్లేశ్, ఏర్పుల యాదయ్య, 16 సంఘాల నేతలు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

రుద్రూర్: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్‌ను పార్టీ అధిష్టానం ఖరారు చేయడంపై పార్టీ మండల నాయకులు శనివారం సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలందరం సమష్టిగా కృషి చేసి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు దువ్వ రవి, పార్వతి ప్రవీణ్, నడిపింటి నగేశ్, అద్ప సాయిలు, ఎంపీటీసీ గౌస్, కర్కె అశోక్, నిస్సార్, మాశెట్టి శ్రీనివాస్, గంగాధర్, పరుచూరి గోపాల్ రావు, సయ్యద్ ముల్తానీ, రాజ వరప్రసాద్, లతీఫ్, ఇమ్రాన్, దత్తు, కుర్మాజీ సాయిలు, బురిగేడి సాయిలు, కాంతారావు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయం సేకరిస్తున్న నాయకులు

రుద్రూర్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణను శనివారం చేపట్టారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండలం కేంద్రానికి వచ్చిన ప్రచార రథానికి స్థానిక నాయకులు స్వాగతం పలికారు. నియోజకవర్గ బీజేపీ మేనిఫెస్టో కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి వాటిని మేనిఫెస్టోలో చేర్చడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ వెల్లడించారు. మండల ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో శనివారం నేను మోదీ కుటుంబ సభ్యుడిని అనే ఫ్ల కార్డులను బీజేపీ నాయకులు ప్రదర్శించారు. ప్రధాని మోదీకి కుటుంబ సభ్యులు లేరనే ప్రతి పక్షాల విమర్శలను తిప్పి కొట్టడానికి ఈ ప్రదర్శన నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానాలు



సిద్ధుల గుట్టపై అన్నపూజ చేస్తున్న నందీశ్వర మహరాజ్



కమ్మర్‌పల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని శివాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై, మార్కండేయ మందిరం, నాగలింగేశ్వర, మంజునాథ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మాక్లూర్‌లోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఎడపల్లిలోని వీరభద్ర స్వామి ఆలయ, రుద్రూర్‌లోని రాజరాజేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, భక్త మార్కండేయ ఆలయాల్లో పూజలు చేపట్టారు. కమ్మర్‌పల్లిలోని కసీర్ హనుమాన్, గొల్లపేట శివాలయం, పలు ఆలయాల ఎదుట భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ముప్కాల్‌లోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, మెండోరా మండలం పోచంపాడ్‌లో మెండోరా ఎంపీపీ సుకన్య దంపతులు పూజలు చేశారు.

నందిపేటలోని పలుగుట్టలో ఉన్న కేదారీశ్వర ఆశ్రమంలో మంగిరాములు మహరాజ్ పూజలు చేపట్టి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కేదారీశ్వర ఆశ్రమంలో, ఉమ్మెడలోని ఉమామహేశ్వర ఆలయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ప్రత్యేక పూజలు చేశారు.

రెంజల్, కోటగిరి ఉమ్మడి మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నవీపేటతో పాటు మండలంలోని జన్నేపల్లి, నాళేశ్వర్‌లోని శివాలయాలలో వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అలరించిన కుస్తీ పోటీలు

మహాశివరాత్రి సందర్భంగా నవీపేట మండలంలోని జన్నేపల్లి, రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి క్యాంపు, బోధన్, సాలూర, ఎడపల్లి, తానాకలాన్, పలు గ్రామాల్లో ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు వెండి, నగదు బహుమతులను అందజేశారు.



ముప్కాల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నందిపేటలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



రెంజల్ శివాలయంలో..



కోటగిరి రామలింగ నందీశ్వరాలయంలో..



నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వరాలయంలో..



జన్నేపల్లిలో తలపడుతున్న మల్లయోధులు



చిక్కడపల్లిలో..

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



పెర్కిట్(ఆర్మూర్): నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. ఆలూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించిన వినయ్‌రెడ్డిని పార్టీ మండల నాయకులు శనివారం పెర్కిట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు కళ్లెం మల్లారెడ్డి, కుంట నారాయణ, తిర్మన్‌పల్లి నవనీత్, ఆమందు సంజీవ్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాస్‌నగర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

మాక్లూర్: మండలంలో గురుకుల మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దాస్‌నగర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరంలో భాగంగా గ్రామస్తులకు ప్లాస్టిక్ వాడితే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని ఆలయ, వాటర్ ట్యాంక్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ లెక్చరర్ వాసవిలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరిత, సభ్యులు సుమలత, శ్వేత, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయల జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం



బోధన్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు



ఆర్మూర్‌లో..

బోధన్/ఆర్మూర్/ కమ్మర్‌పల్లి/ రెంజల్: సీపీఐ(ఎంఎల్) అగ్రనేత రాయల సుభాష్ చంద్రబోస్ జీవితం కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమని బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు పడాల శంకర్, నాగమణి, సీతారం, సీహెచ్ గంగారాం, పోశెట్టి, శంకర్, రాజు, సుశీల, అరుణ, సలీం, శంకర్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ (రవి) వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, నాయకులు ఎం.ముత్తెన్న, ఆకుల గంగారాం, రాజన్న, ఠాకూర్ శేఖర్, నరేందర్, నజీర్, నిఖిల్, సిద్దు, బిరుగొండ శివ తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సుభాష్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు సారా సురేశ్, మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు రాజేశ్వర్, కిషన్, సత్యనారాయణగౌడ్, బాలన్న, సత్తెక్క పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని బోర్గాంలో రైతు కూలీ సంఘం నాయకులు సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రతినిధి మిద్దె నరేందర్, బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, మండల ప్రతినిధులు పుట్టి నాగన్న, నసీర్, పార్వతి రాజేశ్వర్, ఒడ్డెన్న, పోశెట్టి, సాయిరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



బాల్కొండ: 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మెండోరా మండల కేంద్రానికి చెందిన జాదవ్ ప్రియాంక అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు శనివారం ఫోన్ చేశారు. తక్షణమే సిబ్బంది అక్కడికి చేరుకొని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రియాంక మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటీ శ్రీకాంత్ తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) - 10.25
	శైతాన్ (హిందీ) - 1.15, 7.00
	బాబు (తెలుగు) - 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) - 12.30, 3.35, 6.40, 9.45

చక్రేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలు



రథోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



నిశిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

బోధన్‌రూరల్: పట్టణంలోని చక్రేశ్వర శివాలయంలో మహాశివరాత్రి వేడుకలను దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భాలయంలోని శివలింగానికి ప్రత్యేక అభిషేకం, నిశిపూజ చేపట్టారు. ఉత్సవ మూర్తులను ఉత్సవ కమిటీ సభ్యులు రథంలో ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నె హనుమంత్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, సీఐ వీరయ్య, ఈవో రవీందర్, కౌన్సిలర్లు శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, అర్చకులు గణేశ్ మహరాజ్, మహేశ్, శివ కుమార్, డైరెక్టర్లు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

బోధన్‌లో శతచండీ మహాయాగం

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌లో మహాశివరాత్రి సందర్భంగా విశ్వేశ్వర మహాపీఠం ఆధ్వర్యంలో 108 రోజుల పాటు శతచండీ మహాయాగం నిర్వహించనున్నారు. శనివారం మహాయాగాన్ని ప్రనవానంద స్వామి చేపట్టారు. ప్రజల శ్రేయస్సును కోరుతూ శతచండీ మహాయాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాగానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు